స్పందన వినతులను సత్వరం పరిష్కరించండి

అధికారులను ఆదేశించిన సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



రాజంపేట: స్పందనలో ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ అహ్మద్ ఖాన్



రాయచోటి అర్బన్: భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేతలు



ఓబులవారిపల్లె: తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సాయికిషోర్‌రెడ్డి

రాజంపేట : ప్రజలు ప్రతి సోమవారం మండల స్థాయి కార్యాలయాల్లో స్పందన కార్యక్రమంలో ఇచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం తన చాంబరులో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు మండలాల నుంచి స్థానికంగా సమస్యలు పరిష్కారం కావడం లేదని సబ్‌కలెక్టరేట్, జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో ప్రజలు వినతులిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా మండల స్థాయి అధికారులు తమ తమ స్థాయిలో స్థానికంగా తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందన కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. అందువల్ల రెవెన్యూతోపాటు ఇతర శాఖల పరిధిలోని వినతుల పరిష్కారానికి బాధ్యతయుతంగా తీసుకోవాలని హితవు పలికారు.

రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించండి

ఓబులవారిపల్లె : భూముల వివాదాలు, రీ సర్వే, రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి తహసీల్దార్ పీర్ మున్నిని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీర్ మున్ని స్పందన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రైతులు సర్వే సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపించాలన్నారు. ఇటీవలే ఎండలు అధికం కావడంతో పలు చోట్ల కంచెలకు నిప్పు పెట్టడంతో అంటుకొని కాలిపోతున్నాయని రైతులకు పంట నష్టం వాటిల్లుతోందని వాటిని పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌కు సంబంధించిన సమస్యలు, రేషన్‌కార్డుల తదితర సమస్యలకు పరిష్కారం వెంటనే చూపాలన్నారు. అనంతరం ప్రజల నుంచి తహసీల్దార్ పీర్ మున్ని అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పోలి పాపిరెడ్డి, సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి అర్బన్ : ప్రతిసోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం అర్జీదారులకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీనేత హబీబుల్లాఖాన్‌లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన అన్నదానం శిబిరంలో వారు అర్జీదారులు, పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ హైదర్‌వలీ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను సచివాలయం ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని, ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళితే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

వాహనాల తనిఖీ

చిన్నమండెం : రాయచోటి- బెంగళూరు ప్రధాన రహదారిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో భాగంగా మండల కేంద్రంలో ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అదే విధంగా వాహనదారులు తమ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలను విధించారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్చి 4న సర్వసభ్య సమావేశం

సిద్దవటం : మండల సర్వసభ్య సమావేశాన్ని మార్చి 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పులి రామ్‌సింగ్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం మార్చి 4న ఉదయం 10.30 గంటలకు వెలుగు కార్యాలయ సభా భవనంలో, మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష, చర్చ ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

రాజంపేటలో కార్డన్ అండ్ సెర్చ్



కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రాజంపేట : రాజంపేట సబ్‌డివిజన్ పరిధిలో సోమవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు. రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇంద్రానగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్ జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల, పట్టభద్రుల (ఎమ్మెల్సీ) ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు పుల్లయ్య, ఎస్‌ఐలు ప్రసాద్‌రెడ్డి, భక్తవత్సలం, వివిధ పోలీసుస్టేషన్లకు చెందిన ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్, పోలీసులు పాల్గొన్నారు.

కాలిన తోటల పరిశీలన

సంబేపల్లె : మండల పరిదిలోని దుద్యాల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన తోటలను సోమవారం రెవెన్యూ అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాగిరెడ్డి అనే రైతుకు సంబంధించి 25 మామిడి చెట్లు, రమణారెడ్డి 15 మామిడి చెట్లు, గ్రామంలో పలు రైతుల మామిడి తోటలతోపాటు నన్నారి పంట అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయండి

వైఎస్సార్‌సీపీ నేత మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంఆర్‌కెఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి అన్నారు. తన కార్యాలయంలో రాజంపేటకు చెందిన ఈడిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ దాసరి చిదానందగౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే దిశగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు

కలకడ : శ్రీ చౌడేశ్వరిదేవి పవిత్ర జ్యోతులు ఇంటింటి పూజలు అందుకున్నాయి. మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో గ్రామ దేవత శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలను తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర జ్యోతుల ముందు, మేలతాళాలు, సన్నాయి నాదం, చక్క భజనలు, కోలాటం వంటి కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రవేశం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మార్చి 16 నుంచి ఖాజాపీర్ మస్తాన్ వలి ఉరుసు

వాల్మీకిపురం: స్థానిక హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలను మార్చి 16 నుంచి 18వ తేది వరకు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సందాని తెలిపారు. సోమవారం స్థానిక దర్గాలో ముస్లిం మతపెద్దలతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. 16న హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిపుల్లా మొహమ్మద్ హుసేని చిష్తివుల్ ఖాదరి సజ్జాద నషీన్ ఆస్థాన-ఎ-మఖ్దూముల్లాహి సమక్షంలో గంధోత్సవం, చాదర్ పోషి, 17న ఉరుసు , ఖవ్వాలీ, 18న తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇరువర్గాల దాడి ; ముగ్గురిపై కేసు

కలకడ : ఇరువర్గాల దాడిలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ యల్లంకివారిపల్లె హరిజనవాడకు చెందిన వంగిమళ్ళ రెడ్డెప్ప కుమారుడు రమేష్‌ను అదే గ్రామానికి చెందిన మల్లికార్జున, అతని తమ్ముడు వెంకటేశ్వర్లు కర్రలతో కొట్టి గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. అలాగే అదే గ్రామానికి చెందిన మల్లికార్జున భార్య శోభారాణిని రమేష్ దుర్భాషలాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాతపాటి సర్రాజు సేవలు చిరస్మరణీయం



సర్రాజుకు నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, క్షత్రియ నాయకులు

రాజంపేట రూరల్ : మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు పాతపాటి సర్రాజు క్షత్రియులకు చేసిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కొనియాడారు. స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సోమవారం సర్రాజు దశదినకర్మను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.భాస్కర్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొని నివాళి అర్పించారు. అనంతరం సర్రాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సర్రాజు మృతి ఇటు వైఎస్సార్‌సీపీకి అటు క్షత్రియులకు తీరని లోటని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో రాజంపేట క్షత్రియ సంఘం అధ్యక్షుడు డి.కరుణాకర్‌రాజు, క్షత్రియ నాయకులు హెచ్‌వీ రాజు, ఎ.వరదరాజు, జీవీ సుబ్బరాజు, కే చంద్రశేఖర్‌రాజు, డి.రమణరాజు, కె.యల్లంరాజు, సుబ్బరాయుడురాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, కౌన్సిలర్‌లు పి.పెంచలయ్యనాయుడు, ఎస్.నవీన్‌కుమార్, ఎస్.నయంతుల్లా, దాసరి పెంచలయ్య, ఎస్.శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు జావీద్‌అలీ, మసూద్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఓబులవారిపల్లె : మాజీ మండలాధ్యక్షులు తమ్మెద తిరుపాల్ తమ్ముడు తమ్మెద శంకరయ్య(51) అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం గోబ్బూరువారిపల్లె స్వగ్రామంలో అంత్యక్రియల్లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి, మృతుడు శంకరయ్య మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యులు పి.లక్ష్మినరసయ్య, సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు తల్లెం రమణ రెడ్డి, రైల్వేబోర్డు సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్, గజపతిరాజు తదితరులు నివాళులర్పించారు.

ఆహారపొట్లాల పంపిణీ



ఆహారపొట్లాలు అందజేస్తున్న దృశ్యం

చిట్వేలి : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిట్వేలి శ్రీ గణేష్ హోటల్ వారు సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో యాచకులకు, అనాథలకు, పారిశుధ్య కార్మికులకు ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మహేశ్వరరావు పాల్గొన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ చొడవరం సురేంద్రరెడ్డి, అధ్యక్షులు కంబగిరి మునిరావు, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

చర్చి ఏర్పాటును సహించబోం



తహసీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఒంటిమిట్ట : తమ గ్రామంలో మత మార్పిడి సహించేది లేదని మండల పరిధిలోని పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన గ్రామపెద్దలు అంటున్నారు. పెద్ద కొత్తపల్లిలో కొంతమంది చర్చిని ఏర్పాటు చేయాలని చూస్తున్నారని దానిని మేము సహించబోమని పెద్ద కొత్తపల్లి గ్రామ పెద్దలు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం రూపంలో ఫిర్యాదు అందించారు. కార్యక్రమంలో మేకపాటి నందకిశోర్‌రెడ్డి, పలుకూరు మురళీ, పి. వేణుగోపాల్‌రాజు, భాస్కర్, మురళీమోహన్, బ్రహ్మయ్య, విజయమ్మ, విజయకుమారి, ఎరికలయ్య, సత్యప్రకాశ్, సుబ్బలక్షుమ్మ, త్రివిక్రం, వనజాక్షి పాల్గొన్నారు.

లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఖాదర్ వలీ

వీరబల్లి : లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని ఏపీఎం ఖాదర్ వలీ కోరారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జరిగిన సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సమాఖ్యల లావాదేవీలన్నీ సమావేశాలలో మాత్రమే జరగాలన్నారు. అన్ని రకాల లావాదేవీలకు రశీదులు తప్పక ఉండాలని, ప్రతినెల పుస్తక నిర్వహణ చేయాలన్నారు. ఆరోగ్య సూత్రాలను సంస్థ ప్రతినిధి సంతోష్ కుమార్ వివరించారు.

కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలి

కడప : పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు.

పక్కా గృహాల లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో పక్కా గృహాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పక్కా గృహాలపై అధికారులతో మండల ప్రత్యేకాధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలానికి 1,167 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు సంపూర్ణంగా పూర్తయిన గృహాలతోపాటు పూతల దశలో ఉన్న గృహాలు, స్లాబ్ దశలో ఉన్న గృహాలు, రూఫ్ దశలో ఉన్న గృహాలు, బేస్‌మట్టం స్థాయిలో ఉన్న గృహాలు, అసలు నిర్మాణాలకు నోచుకోని గృహాల లబ్దిదారులకు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సిద్దవటం గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు. లబ్దిదారులు గృహాలను నిర్మించుకోవాలని అయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, తహసీల్దారు శంకర్‌రావు, వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై బాలికలు అప్రమత్తంగా ఉండాలి



జాగ్రత్తలను వివరిస్తున్న వైద్యుడు విజయ్‌కుమార్

రామాపురం : ఆరోగ్యంపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ , మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడులు తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేట ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సోమవారం హాజరై బాలికల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాజరు పట్టిక, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎండలు ఎక్కువగా ఉన్నాయని, నీరు ఎక్కువ శాతం తీసుకోవాలని, చక్కగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ అనుపమ, హాస్టల్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ప్రీతి మరణంపై పౌరహక్కుల సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న రవిశంకర్ తదితరులు

రాయచోటి అర్బన్ : మెడికో ప్రీతి మృతిపై తెలంగాణ ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఆయన పలు సంఘాల నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం పిజి చదువుతున్న ప్రీతిని, అదే బ్రాంచ్‌లో సీనియర్ అయిన సైఫ్ మానసిక వేధింపులకు గురిచేయగా, హెచ్‌ఓడీ, ప్రిన్సిపల్‌లు అతనికి సహకరించి ప్రీతికి చావుకు కారకులయ్యారంటూ ఆరోపించారు. ప్రీతి మరణం ఆత్మహత్య, హత్య అనేది తెలియాలంటే తెలంగాణ ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశాలివ్వాలని కోరారు. అలానే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బంజారా సంఘం రాష్ట్రనేత శంకర్ నాయక్, నేతలు రెడ్డినాయక్, మదన్‌మోహన్‌లు, బిసి సంఘం నేత కోటకొండ రవిశంకర్, సమతా సైనిక్ దళ్ నేత శ్రీనివాసులు, బీటీఏ నేత అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారి



అల్పాహారాన్ని పరిశీలిస్తున్న షామీర్

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి షామీర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. వంటలను ఆయన స్వయంగా పరీక్షించి నాణ్యతా ప్రమాణాలను తెలుకున్నారు. అనంతరం మెస్ పరిసరాలను కలయ తిరిగి శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సరుకులను నాణ్యతా పరీక్షల కోసం ఆయన వెంట పలు రకాల సరుకులను తీసుకెళ్లారు. అనంతరం ప్రిన్స్‌పాలతో పలు సమస్యలపై చర్చించారు.

భవన నిర్మాణాల ఆమోదం సులభతరం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

రాయచోటి టౌన్ : భవన నిర్మాణాల ఆమోదం ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఇకపై సులభతరంగా మారుతోందని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ వైస్ చైర్మన్ నందన్ ఆధ్వర్యంలో డీపీఓ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో రాయచోటి డివిజన్ పరిధిలోని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో 300 చదరపు మీటర్ల విస్తీరణ తక్కువ వైశాల్యం బిల్డింగ్ అనుమతి ప్రక్రియ ఎంగ్రో ల్యాబ్స్ వారిచే అభివృద్ధి చేయబడ్డ వెబ్ అప్లికేషన్‌పై ఎలా నమోదు చేసుకోవాలనే విషయాలపై పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ పి. శైలజ, ఏపీఓ ఆసీఫ్, ఏపీఓ కృష్ణసింగ్ పాల్గొన్నారు.

ఘనంగా అక్కదేవతల తిరునాల



భక్తులకు దర్శనమిస్తున్న శివలింగస్వరూపుడు



భక్తులను ఆకట్టుకున్న చాందినీబండ్లు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లె సమీపంలో కొలువైన అక్కదేవతలు, శివలింగస్వరూపుల ఆలయం భక్తులపాలిట కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది శివరాత్రి అయిన వారానికి ఇక్కడ అక్కదేవతల తిరునాలను గ్రామస్తులు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ జాతర రోజు వచ్చిన భక్తులు అక్కదేవతల కోలనులో మునిగి, తడిబట్టలతో అగ్నిగుండ ప్రవేశం చేసి, గర్భాలయంలోని శివలింగస్వరూపుడైన మహాదేవున్ని దర్శించుకుంటే సర్వపాపాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం నుంచి ఆలయంలోని మూలవిరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి చాందినీబండ్లు ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం చేశారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

పంట నష్టపరిహారం అందేలా చూడండి

రాయచోటి అర్బన్ : గత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీసీజన్‌లో రైతుల పంటల సాగు ఈ-క్రాప్ రిజిస్ట్రేషన్‌ను రైతు భరోసా కేంద్రాల ద్వారా చేయించాలన్నారు. వరదలలో కొట్టుకుపోయిన పింఛా, అన్నమయ్య ప్రాజెక్టుల పునఃనిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాధనాయక్ తోపాటు పలువురు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: మండలంలో ఐదుగురు జూదరులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకటేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ.9400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

భద్రకాళి సమేతుడికి పల్లకీసేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళి సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారు పల్లకీలో ఊరేగారు. ప్రతి సోమవారం లాగానే ఈ రాత్రి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పల్లకీలో మాఢవీధులలో ఊరేగించారు. స్వామి వారి పల్లకీ ఉత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు మంగళహారతులు, తీర్థప్రసాదాలు అందజేశారు. పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

ములకలచెరువు: కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్‌కి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రోడ్డు పనుల కోసం కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బురకాయలకోట వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ప్రదీప్‌కుమార్(37) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు డ్రైవర్‌ను 108 సహాయంతో చికిత్స కోసం మదనపల్లి జిల్లా హాస్పెటల్‌కు తరలించారు.

ఆలయ పరిసరాలలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

సిద్దవటం : నిత్యపూజ స్వామి ఆలయం పరిసరాలలో సోమవారం పారిశుధ్య పనులు చేయించినట్లు ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయం పరిసరాలలో ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలు ఉండటంతో తొలగించామన్నారు. అలాగే పంచలింగాల స్వామి ఆలయం ఆవరణలో వ్యర్థ పదార్థాలు, తడిగా ఉండటంతో పనులు కొంత ఆలస్యమవుతోందన్నారు. వాటిని కూడా త్వరలో శుభ్రం చేయిస్తామని చెప్పారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, వాటర్ ప్యాకెట్లను పూర్తి స్థాయిలో తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయం సిబ్బంది చంద్ర, కూలీలు తదిరతులు పాల్గొన్నారు.